క్లుప్తంగా

పీహెచ్‌డీ పట్టా పొందిన శంకరజ్యోతి



దామెర : మండలంలోని కోగిలివాయి గ్రామానికి చెందిన గట్ల అనిల్‌రెడ్డి సతీమణి శంకరజ్యోతి ఉస్మానియా యూనివర్సిటీ నుంచి సోమవారం పీహెచ్‌డీ పట్టా పొందారు. ఖమ్మం జిల్లాలోని ట్రైబల్ గురుకులం డిగ్రీ కళాశాలలో అధ్యాపకురాలిగా పని చేస్తున్న శంకరజ్యోతికి గణితంలో ఏ స్టడీ ఆన్ రెగ్యూలర్ డామినేషన్ ఇన్ లిటాట్ గ్రాఫ్స్ అంశంపై సమర్పించిన పరిశోధన పత్రానికి పట్టా లభించిందని తెలిపారు. గణితంలో ఇబ్బందులు పడే వారికి సులభంగా అర్థమయ్యే విధంగా ఉండేలా చేయడమే లక్ష్యంగా పెట్టుకొని పీహెచ్‌డీ పూర్తిచేసినట్లు శంకరజ్యోతి తెలిపారు. పద్మావతిసోమిరెడ్డి, కుటుంబ సభ్యులకు ఆమె కృతజ్ఞతలు తెలిపారు.

విద్యార్థులకు ఎగ్జామ్ కిట్ల పంపిణీ



ఆత్మకూరు : మండలంలోని గుడెప్పాడ్‌లో గల పెద్దాపూర్ ఎంజేపీ బాలికల గురుకుల పాఠశాల విద్యార్థులకు రేమిడి శ్రీనివాస్‌రెడ్డి జ్ఞాపకార్థం ఆయన సోదరుడు రేమిడి మల్లారెడ్డి శనివారం ఎగ్జామ్ కిట్లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులు శ్రద్ధగా చదివి ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనిత, గంట రాహుల్‌రెడ్డి, జిట్టి మధు, రిషిత్‌రెడ్డి, వర్షిత్‌రెడ్డి, శేషు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సకాలంలో పన్నులు చెల్లించాలి

మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్

పరకాల : 2024–25 ఆర్థిక సంవత్సరం ఆస్తి పన్నులతో పాటు నల్లా, ట్రేడ్ లైసెన్స్ పన్నులను సకాలంలో చెల్లించి మున్సిపాలిటీ అభివృద్ధికి సహకరించాలని పరకాల మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ శనివారం ఓ ప్రకటనలో కోరారు. ఈనెల 31లోపు చెల్లించని పక్షంలో సంబంధిత ఇంటి యజమానులకు, వ్యాపారులకు నోటీసులు జారీ చేయడంతో పాటు చట్టప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఆయన స్పష్టం చేశారు.

సూరంపేటలో పశు వైద్యశిబిరం



శాయంపేట : మండలంలోని సూరంపేట గ్రామంలో శనివారం మండల పశువైద్యాధికారి సునీల్ పశువైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పశువులకు గర్భకోశవ్యాధుల నివారణ నిమిత్తం కృత్రిమ గర్భధారణ చేయడం వలన మేలు జాతి దూడలు వృద్ధి చెందుతాయని తెలిపారు. ఈ వైద్య శిబిరంలో 32 పశువులకు గర్భధారణ పరీక్షలు చేపట్టి ఉచితంగా మందులు పంపిణీ చేశామన్నారు. గోపాలమిత్ర సూపర్‌వైజర్ ప్రకాశ్‌రెడ్డి, గోపాలమిత్రలు సతీశ్, మధుకర్, పాల్గొన్నారు.

పండ్ల పంపిణీ



దామెర : మండల కేంద్రంలోని ఏకశిల ప్రైమ్ స్కూల్ ఆధ్వర్యంలో 9వ తరగతి విద్యార్థులు వరంగల్‌లోని ఎంజీఎం ఆస్పత్రిలో శనివారం రోగులకు పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏకశిల విద్యాసంస్థల చైర్మన్ గౌరు తిరుపతిరెడ్డి, డైరెక్టర్ బేతి కొండల్ రెడ్డి విద్యార్థులను అభినందించారు. వైస్ ప్రిన్సిపాల్ మణికుమార్, స్టాఫ్ ఇన్‌చార్జ్ విజయ్‌కుమార్, సైన్స్ ఉపాధ్యాయుడు మణికుమార్, సుకన్య, సృజన్ కుమార్, ఉదయ్‌కుమార్, కృష్ణంరాజు, వెన్నెల పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి ఆర్థిసాయం



శాయంపేట : మండలంలోని హుస్సేన్‌పల్లి గ్రామానికి చెందిన భూతాల వీరన్న ఇటీవల అనారోగ్యంతో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న ఆరే సంక్షేమ సంఘం నాయకులు శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి రూ. 5వేల ఆర్థికసాయం అందించారు. ఆ సంఘం అధ్యక్షుడు రాజు, రాజేందర్, గుజ్జుల రవీందర్‌జీ, నిరంజన్, గోపాల్‌రావు, భాస్కర్, రాజు, శ్రీనివాస్, శ్రీనివాస్ ఉన్నారు.

లారీల పార్కింగ్‌తో పరేషాన్



హైవేపై నిలిచిన లారీ



జనసంచారం ఉన్న ప్రదేశంలో నిలిపిన లారీ

- ఇబ్బందులు పడుతున్న వాహనదారులు
- రాత్రి వేళలో ప్రమాదాలు జరిగే అవకాశం
- ప్రత్యేక స్థలాలు ఏర్పాటు చేయాలని వాహనదారుల డిమాండ్

ఆత్మకూరు : మండల పరిధిలోని రెండు జాతీయ రహదారుల్లో నిత్యం వందలాది లారీలు రవాణా సాగిస్తుంటాయి. అయితే లారీల పార్కింగ్‌కు జాతీయ రహదారుల సమీపంలో ప్రత్యేక పార్కింగ్ స్థలాలు లేకపోవడంతో ఎక్కడపడితే అక్కడ లారీ డ్రైవర్లు పార్కింగ్ చేస్తుండడంతో వాహనదారులు ఇబ్బందులు తీవ్ర పడుతున్నారు. ముఖ్యంగా రాత్రి వేళ లారీల పర్కింగ్ ప్రమాదకరంగా మారిందని పలువురు వాహనదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. లారీలు ఆపిన తర్వాత కనీసం ఇండికేషన్ లైట్లు కూడా వేయడం లేదని ఆగ్రహిస్తున్నారు. గుడెప్పాడ్ జంక్షన్‌తో పాటు రోడ్డు మార్గంలో లారీలు పార్కింగ్ చేస్తున్నారని, ఛత్తీస్‌ఘడ్, మహారాష్ట్ర తదితర రాష్ట్రాలకు లారీలు ఈ రహదారుల వెంబడి రవాణా సాగిస్తుంటాయని, లారీ డ్రైవర్లు వారి అవసరాల కోసం లారీలను ఎక్కడపడితే అక్కడే ఆపుదల చేస్తున్నారని వాపోతున్నారు. లారీ డ్రైవర్లు రోడ్లపైన నిలిపి వంట చేసుకోవడం తదితర పనులు చేసుకోవడంతో ఇతర వాహనదారులకు ఇబ్బందులు తప్పడం లేదని పలువురు అంటున్నారు. లారీలకు వెనుకభాగంలో లైట్లు లేకపోవడంతో వెనుక నుంచి వచ్చే వాహనాలకు నిలిచిన లారీలు కనపడకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని భయాందోళన చెందుతున్నారు. ఈ మార్గంలో ఎక్కువగా ఇసుక లారీలు రవాణా సాగిస్తుంటాయని, అలాగే గూడ్స్ లారీలు ఇతర రాష్ట్రాలకు వెళ్తుంటాయని అంటున్నారు. పార్కింగ్ స్థలాలు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ ఎవరూ పట్టించుకోవడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ఇప్పటికైనా రోడ్లపైన లారీలు నిలుపకుండా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని ఈ సందర్భంగా వారు కోరారు.

సుందరీకరణ పనుల పరిశీలన



సుందరీకరణ పనులను పరిశీలిస్తున్న కమిషనర్ వెంకటేశ్

పరకాల : దామెర చెరువు సుందరీకరణ పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్ ఆదేశించారు. శనివారం చెరువు సుందరీకరణ పనులను ఆయన పరిశీలించారు. పనుల గురించి సంబంధిత కాంట్రాక్టర్‌ను అడిగి తెలుసుకున్నారు. పనులను వేగవంతం చేయడంతో పాటు నాణ్యత పాటించాలని కోరారు. నాణ్యత లోపిస్తే చట్టపరంగా చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు.

సమస్యల పరిష్కారానికి పోరాడండి

ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డి

కమలాపూర్ : నిత్యం ప్రజల మధ్యన ఉంటూ సమస్యల పరిష్కారానికి పోరాడాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డి కార్యకర్తలకు సూచించారు. హుజూరాబాద్‌లోని తన క్యాంపు కార్యాలయంలో శనివారం కమలాపూర్ మండల ముఖ్య కార్యకర్తలతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి ఏడాది గడవకముందే ప్రజల నుంచి తీవ్ర వ్యతిరేకత ఏర్పడిందని, సీఎం రేవంత్ రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీలు నెరవేర్చడంలో పూర్తిగా విఫలమయ్యారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీపై విసుగు చెందిన ప్రజలంతా బీఆర్‌ఎస్ పార్టీవైపే ఉన్నారని, కాంగ్రెస్ ఆరు గ్యారంటీలపై ఎప్పటికప్పుడు నిలదీయాలన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వ అరాచకాలపై నిలదీస్తున్న బీఆర్‌ఎస్ ప్రజాప్రతినిధులపై అక్రమ కేసులు పెట్టి అరెస్టులు చేస్తున్న ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. తన కోసం కష్టపడ్డ నాయకులు, కార్యకర్తలకు ఎల్లవేళలా అండగా ఉంటానన్నారు. మార్చి 10వ తేదీ వరకు అన్ని గ్రామాల్లో బీఆర్‌ఎస్ పార్టీ, అనుబంధ సంఘాల కమిటీలు నియమించాలని అన్నారు. కార్యక్రమంలో పీఏసీఎస్ వైస్ చైర్మన్ ఇంద్రసేనారెడ్డి, డైరెక్టర్ సత్యనారాయణరావు, కేడీసీసీబీ డైరెక్టర్ కృష్ణప్రసాద్, బీఆర్‌ఎస్ నాయకులు కుమారస్వామిగౌడ్, తిరుపతిరావు, లక్ష్మణ్‌రావు, నవీన్‌కుమార్, సమ్మయ్య, చంద్రారెడ్డి, మురళి, వివిధ గ్రామాల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పెళ్లి కావడం లేదని..

పురుగుల మందు తాగిన యువతి చికిత్స పొందుతూ మృతి



అలేఖ్య (ఫైల్)

ఎల్కతుర్తి : పెళ్లి కావడం లేదని మనస్థాపం చెందిన ఓ యువతి గత నెల 27వ తేదీన గడ్డి మందు తాగగా కుటుంబ సభ్యులు ఆస్పత్రిలో చేర్పించారు. చికిత్స పొందుతూ శనివారం మృతిచెందింది. ఈ సంఘటన దామెర గ్రామంలో చోటుచేసుకుంది. ఎస్సై ప్రవీణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన చుంచు అలేఖ్య(21) బీఎస్సీ నర్సింగ్ చదువుతోంది. రెండేళ్ల క్రితం బంధువుల అబ్బాయితో పెళ్లి సంబంధం కుదిరింది. కానీ ఆర్థిక పరిస్థితులు సరిగా లేకపోవడంతో కుటుంబ సభ్యులు పెళ్లిని వాయిదా వేస్తూ వచ్చారు. దీంతో మనస్థాపం చెందిన అలేఖ్య గత నెల 27వ తేదీన ఇందిరానగర్ గ్రామ చెరువుకట్టపై గడ్డి మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లింది. అటుగా వెళ్తున్న ఓ వ్యక్తి చూసి కుటుంబ సభ్యులకు సమాచారం ఇవ్వడంతో చికిత్స నిమిత్తం 108వాహనంలో ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతున్న ఆమె పరిస్థితి విషమించి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఎస్సై తెలిపారు.

దారి పునరుద్ధరించి న్యాయం చేయండి

ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి బాధితుల వినతి



ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

కమలాపూర్ : మండల కేంద్రానికి చెందిన మొగిలిచెర్ల లచ్చమ్మ ఇంటికి వెళ్లే దారిని పునరుద్ధరించి న్యాయం చేయాలని హుజూరాబాద్ ఎమ్మెల్యే పాడి కౌశిక్‌రెడ్డిని బాధిత కుటుంబీకులు మొగిలిచెర్ల శిరీష, విలాస్ కోరారు. ఈ మేరకు హుజూరాబాద్‌లో ఎమ్మెల్యే కౌశిక్‌రెడ్డిని శనివారం కలిసి వినతిపత్రం అందజేశారు. బాధిత కుటుంబీకురాలు మాట్లాడుతూ.. తన మామ, భర్త మృతిచెందడంతో తాము పెద్ద దిక్కు కోల్పోయామని, సుమారు నాలుగేళ్ల క్రితం తమ ఇంటికి వెళ్లే దారిని మొగిలిచెర్ల భిక్షపతి అనే ప్రభుత్వ ఉపాధ్యాయుడు కబ్జా చేసి దారికి అడ్డుగా గోడ నిర్మించాడని, ఆ సమయంలో అడ్డుకున్న తమపై (లచ్చమ్మ, శిరీష, విలాస్, అన్వేష్) విచక్షణా రహితంగా దాడి చేసి గాయపర్చాడని ఆరోపించారు. సంబంధిత అధికారులు, పోలీస్‌ల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదని ఆరోపించారు. అప్పటి నుంచి దారి కోసం న్యాయ పోరాటం చేస్తున్నామని, ఇప్పటికైనా చర్యలు తీసుకుని దారి పునరుద్ధరింపజేయాలని ఎమ్మెల్యేను కోరారు.

ప్రజల వద్దకే తపాలా సేవలు



వృద్ధురాలికి పింఛన్ అందజేస్తున్న అనంతరామ్‌నాయక్

శాయంపేట : ప్రజల వద్దకే తపాలా సేవలు అందుతున్నాయని పరకాల డివిజన్ పోస్టాఫీస్ అసిస్టెంట్ సూపరిండెంటెంట్ అనంతరామ్ నాయక్ అన్నారు. సోమవారం ప్రజల వద్దకు పోస్టాఫీస్ సేవల కార్యక్రమంలో భాగంగా మండలంలోని కొప్పుల గ్రామాన్ని సందర్శించి ఆసరా పింఛన్, ఉపాధి హామీ నగదును లబ్ధిదారులకు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. పోస్టాఫీస్ సేవలను ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. ఇన్సూరెన్స్ సేవల్లో భాగంగా కేవలం రూ.755కు రూ.15లక్షల ప్రమాద బీమా స్కీం అందుబాటులో ఉందని ప్రజలు వినియోగించుకోవాలని కోరారు. తపాలా శాఖ మినీ ఏటీఎం సేవలు కూడా అందుబాటులో ఉన్నాయని, సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో తలాపా శాఖ సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

సాయంత్రమైతే వైద్యసేవలు బంద్



మూసి ఉన్న పీహెచ్‌సీ

ఆత్మకూరు : ఒకప్పుడు రౌండ్‌క్లాక్ హాస్పిటల్‌గా పేరుపొందిన ఆత్మకూరు పీహెచ్‌సీ.. ప్రస్తుతం సాయంత్రానికే తాళం వేసి దర్శనమిస్తోంది. సిబ్బంది కొరతతో సాయంత్రం వరకే వైద్య సేవలు కొనసాగిస్తున్నారు. అదనంగా ఇద్దరు స్టాఫ్‌నర్సులను నియమించాల్సి ఉన్నప్పటికీ ఉన్నతాధికారులు పోస్టులను భర్తీ చేయలేదు. దీంతో మెరుగైన వైద్య సేవలు అందడం లేదనే విమర్శలు వినిపిస్తున్నాయి. శనివారం సాయంత్రం పీహెచ్‌సీ ఎదుట ఓ రోడ్డు ప్రమాదం జరుగగా గాయపడిన బాధితుడిని పీహెచ్‌సీకి తీసుకెళ్లగా ఆస్పత్రి మూసి ఉంది. దీంతో ఎంజీఎంకు తరలించారు. ఈ విషయమై మండల వైద్యాధికారిణి స్పందనను వివరణ కోరగా.. అదనపు సిబ్బంది కావాలని, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినట్లు తెలిపారు. సిబ్బంది లేకపోవడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకే వైద్య సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

మధ్యాహ్న భోజనం నాణ్యతగా ఉండాలి



మాట్లాడుతున్న ఎంఈఓ చంద్రమౌళి

వేలేరు : ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్నం నాణ్యమైన భోజనం వడ్డించాలని ఎంఈఓ చంద్రమౌళి అన్నారు. శనివారం మండల విద్యాశాఖ అధికారి కార్యాలయంలో కుక్, హెల్పర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం అందించాలన్నారు. వంటచేసే పరిసరాలను ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీఓ భాస్కర్, ఆర్‌ఐ సురేందర్, హెచ్‌ఎంలు రాజన్న, శ్రీదేవి, జయసాగర్, విజయ్‌మోహన్, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు తదితరులు పాల్గొన్నారు.

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



ధర్మసాగర్ : నివాళులర్పిస్తున్న నాయకులు



కమలాపూర్‌లో..



ఐనవోలులో..

ఎమ్మెస్పీ, ఎమ్మార్పీఎస్ నాయకులు

ధర్మసాగర్ : మాదిగ అమరవీరుల త్యాగాలు మరువలేనివని ఎమ్మెస్పీ జిల్లా అధికార ప్రతినిధి గంగారపు శ్రీనివాస్, ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డు శాంతిసాగర్ అన్నారు. మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు అన్వేష్ ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అమరవీరుల త్యాగాలను జాతి ఎన్నటికీ మరువదని, వారి స్ఫూర్తిని స్మరించుకోవాల్సిన అవసరం ఉందన్నారు. జాతి కోసం వారు చిందించిన నెత్తుటి చుక్కల సాక్షిగా ఎస్సీ వర్గీకరణను సాధించామని, అది సంపూర్ణంగా ఉండేలా జాతి కోసం, సమాజ హితం కోసం పాటుపడాలని అన్నారు. నాయకులు శంషొద్దీన్, బాబు, రాజు, కల్యాణ్, అనిల్, రమేశ్, శంకర్, ప్రణయ్, అరవింద్, బరిగెల ప్రదీప్, నితిన్, శ్రీధర్, అభిలాష్, పవన్, ఏలియా, ప్రభుదేవా, సంజీవ పాల్గొన్నారు.

కమలాపూర్ : ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరుల ఆశయాలు కొనసాగిస్తామని ఎమ్మార్పీఎస్ జిల్లా ప్రధాన కార్యదర్శి అంకిల్ల రాజు అన్నారు. స్థానిక అంబేడ్కర్ కూడలి వద్ద ఎమ్మార్పీఎస్ మండల శాఖ ఆధ్వర్యంలో శనివారం మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎస్సీ వర్గీకరణ ఉద్యమంలో ప్రాణత్యాగం చేసి అమరులైన మాదిగ అమరవీరులను స్మరించుకుంటూ వారి చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎంఎస్పీ జిల్లా ఉపాధ్యక్షుడు సంపత్, జిల్లా కార్యదర్శి రవీందర్, జిల్లా నాయకుడు ప్రసాద్, ఎమ్మార్పీఎస్ మండల ఉపాధ్యక్షుడు రమేశ్, కార్యదర్శి చంద్రమౌళి, నాయకులు ప్రభాకర్, శ్రీనివాస్, రాజమల్లు, శ్రీనివాస్, భూమయ్య, శంకర్ పాల్గొన్నారు.

దామెర : ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన మాదిగల అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని శనివారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు గోవింద్ రవికుమార్ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ సర్పంచ్ శ్రీరామ్‌రెడ్డి, శ్రీను, రమేశ్, రవీందర్, శ్రీను పాల్గొన్నారు.

శాయంపేట : ఎస్సీ వర్గీకరణ కోసం అమరులైన మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని సోమవారం ఎమ్మార్పీఎస్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు తుడుం వెంకటేశ్ అమరవీరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెస్పీ మండల అధ్యక్షుడు భాస్కర్, బీజేపీ మండల అధ్యక్షుడు నరహరిశెట్టి రామకృష్ణ, బీఆర్‌ఎస్ మండల యూత్ అధ్యక్షుడు మోహన్, నాయకులు రేణికుంట్ల సదయ్య, గడ్డం బాబు, విజయ్, కిరణ్, విజయ్, సాంబరాజు, సాంబయ్య, మహేశ్, పాల్గొన్నారు.

వేలేరు : ఎస్సీ వర్గీకరణ కోసం ప్రాణాలర్పించిన మాదిగ అమరవీరుల త్యాగాలు గొప్పవని ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు మనోజ్‌కుమార్ అన్నారు. మండల కేంద్రంలో మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఎంఎస్పీ మండల అధ్యక్షుడు రాజయ్య, నాయకులు యేసు, శ్రీకాంత్, మల్లయ్య, గిరిప్రసాద్, సంజీవ్, యాకుబ్, భాస్కర్, వెంకటయ్య పాల్గొన్నారు.

ఆత్మకూరు : మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల అధ్యక్షుడు నద్దునూరి రఘు ఆధ్వర్యంలో మాదిగ అమరవీరుల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. అమరుల చిత్రపటాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ ఎంపీపీ మార్క సుమలత, మాజీ జెడ్పీటీసీ రాధిక, మాజీ ఎంపీటీసీ వరుణ్‌గాంధీ, ఎమ్మార్పీఎస్ మండల ప్రధానకార్యదర్శి గణేశ్, మాదాసి పైడి పాల్గొన్నారు.

ఐనవోలు : మండలంలోని వివిధ గ్రామాల్లో శనివారం మాదిగ అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని ఎమ్మార్పీఎస్ సీనియర్ నాయకుడు, ఎమ్మెస్పీ జిల్లా ప్రధాన కార్యదర్శి బొక్కల నారాయణ ఆధ్వర్యంలో నిర్వహించారు. రవి, నాగేశ్వర్‌రావు, మీరా సాహెబ్, ప్రభాకర్, సరేందర్, దామోదర్, ములుగు మహేశ్, భారతి, ప్రకాశ్ నివాళులర్పించారు.

నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం



ఎల్కతుర్తి : ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



ముల్కనూరులో..

ఎల్కతుర్తి : మామునూరు ఎయిర్‌పోర్టుకు కేంద్రం గ్రీన్ సిగ్నల్ ఇవ్వడాన్ని హర్షిస్తూ భీమదేవరపల్లి మండలం ముల్కనూరు, ఎల్కతుర్తి మండల కేంద్రంలోని బస్టాండ్ కూడలి వద్ద బీజేపీ నాయకులు శనివారం ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు బీజేపీ నాయకులు మాట్లాడుతూ.. రాష్ట్ర అభివృద్ధి భారతీయ జనతా పార్టీతోనే సాధ్యపడుతుందన్నారు. దీనికి సహకరించిన కేంద్ర మంత్రులు బండి సంజయ్, కిషన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పంటల బీమా పథకం అమలు చేయాలి

- ఆర్డీఓకు తెలంగాణ రైతు రక్షణసమితి నాయకుల వినతి



ఆర్డీఓకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

పరకాల : రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకాన్ని వెంటనే అమలు చేయాలని తెలంగాణ రైతు రక్షణ సమితి వరంగల్ ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు వరికెల కిషన్‌రావు డిమాండ్ చేశారు. శుక్రవారం పరకాల ఆర్డీఓ నారాయణకు తెలంగాణ రైతు రక్షణ సమితి నాయకులు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా కిషన్‌రావు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా లక్షలాది ఎకరాల్లో వరిపంట సాగులో ఉందని, యాసంగి వరి పంట దోమకాటు, అగ్గి తెగులు, వడగండ్ల వానలతో రైతులు కోలుకోలేని విధంగా గతంలో నష్టం వాటిల్లిందన్నారు. మామిడి కోత సమయంలో పూర్తిగా దెబ్బతినే ప్రమాదం ఉందన్నారు. ప్రధాన మంత్రి ఫసల్ బీమా యోజన అమలు చేసే అవకాశం లేనందున భవిష్యత్‌లో వరి, మిర్చి, మొక్కజొన్న, మామిడి పంట నష్టం జరిగే ప్రమాదం ఉందన్నారు. వెంటనే రాష్ట్ర ప్రభుత్వం పంటల బీమా పథకం అమలు పరిచే కంపెనీలతో చర్చలు జరిపి వారిని ఒప్పించి అతి తక్కువ ప్రీమియంతో ఇప్పటి నుంచి పంటలు చేతికి వచ్చే వరకు బీమా పథకం అమలు చేయాలని కోరారు. రైతుల పరిస్థితులను గమనించి నిర్ణయం తీసుకోవాలని ఈ సందర్భంగా కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం నాయకులు సురావు బాపురావు, లోనె సతీశ్, కోడెం రవీందర్‌తో పాటు తదితరులు పాల్గొన్నారు.

మిలిటెంట్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలి

- జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్



సమావేశంలో మాట్లాడుతున్న సుధాకర్

హన్మకొండ: మాలలు మిలిటెంట్ తరహా పోరాటాలకు సిద్ధం కావాలని జాతీయ మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు పిల్లి సుధాకర్ పిలుపునిచ్చారు. హనుమకొండలోని మాల మహానాడు ఉమ్మడి వరంగల్ జిల్లా సమావేశం శనివారం జరిగింది. తొలుత భారత రాజ్యాంగ నిర్మాత బీఆర్.అంబేడ్కర్ చిత్రపటానికి నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహానాడు జిల్లా అధ్యక్షుడు బొల్లం రాంకుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రొఫెసర్ ఎర్రగట్టు స్వామి, ప్రొఫెసర్ సదాశివుడు, మాల మహానాడు రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ జిల్ల ప్రభాకర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వెన్న రాజు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్నికల వాగ్దానాలు నెరవేర్చాలి

వరంగల్ చౌరస్తా: కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల ముందు రైతులకు ఇచ్చిన వాగ్దానాలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ రైతు సంఘం రాష్ట్ర కన్వీనర్ సోమిడి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. వరంగల్ అబ్బనికుంటలో తెలంగాణ రైతు సంఘం కార్యాలయంలో వరంగల్ జిల్లా కమిటీ సమావేశం సంఘ ఉపాధ్యక్షుడు ఊరటి హంసారెడ్డి అధ్యక్షతన శనివారం జరిగింది. ఈ సందర్భంగా శ్రీనివాస్, సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఓదెల రాజయ్య మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 5నుంచి 13వ తేదీ వరకు రాష్ట్రవ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు చేపట్టాలని పిలుపునిచ్చారు. కేంద్ర ప్రభుత్వ విధానాలను ప్రతిఒక్కరూ వ్యతిరేకించాల్సిన అవసరం ఉందన్నారు. నాయకులు పుచ్చకాయల బుచ్చిరెడ్డి, మోకిడి పేరయ్య, జెండా అంబయ్య, నల్ల విజేందర్, జంగ జనార్ధన్ రెడ్డి, రేముడాల దామోదర్ రెడ్డి, సిరుల రవీందర్, తిప్పారపు రాజు, సోమిడి సాంబయ్య పాల్గొన్నారు.